
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5 సిద్దిపేట
గురువారం 28 మార్చి 2024

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : గురువారం సా: 6.34 గం.
సహార్ : శుక్రవారం ఉ: 4:51 గం.


రేషన్ ఈకేవైసీ 85.46 శాతమే





- బోగస్‌కు చెక్ పెట్టేందుకు...
- కార్డుల ఆధారంగా యూనిట్ల పరిశీలన
- వేలిముద్ర వేసిన వారి పేర్లే లెక్కలోకి

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 27 : రేషన్‌కార్డుకు ఈ-కేవైసీ తప్పనిసరి చేస్తూ ఆరునెలల క్రితం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కొందరు చనిపోయినా వారి పేరు కార్డుల్లో కొనసాగుతూనే ఉన్నది. అలాంటి వాటిని తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ఆహార భద్రతాకార్డులోని సభ్యులందరూ సంబంధిత రేషన్‌షాప్‌కు వెళ్లి ఈ కేవైసీ (నో యువర్ కస్టమర్) చేయించుకోవాలని పౌరసరఫరాలశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

హోల్డ్‌లో ఈకైవేసీ చేయని వారి పేర్లు

సిద్దిపేట జిల్లాలో 684 రేషన్ దుకాణాలున్నాయి. వీటి పరిధిలో 2,91,437 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో ఏఏవై (అన్నపూర్ణ) కార్డుదారులకు ఒక్కో యూనిట్‌కు 10 కిలోలు, ఏఎఫ్ఎస్‌సీ (అంత్యోదయ) కార్డుదారులకు 35 కిలోలు, ఎఫ్ఎస్‌సీ కార్డు లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ ఆరు కిలోల చొప్పున ఉచితంగా రేషన్‌ను ప్రభుత్వం అందజేస్తున్నది. అయితే కొన్నిచోట్ల మృతిచెందిన వారి పేరిట ప్రతినెలా ఉచితంగా రేషన్ తీసుకుంటున్నారు. అలాంటి యూనిట్లను ఈకేవైసీతో తొలగించారు.

జిల్లాలో 2,91,437 కార్డులున్నాయి. అందులో 8,94,586 లబ్ధిదారులు ఉన్నారు. ఈపాస్ మిషన్‌లో కార్డుదారు ఆధార్ నంబర్ నమోదు చేయగానే ఆ కార్డులో ఎందరు ఉన్నారో చూపిస్తుంది. వారందరూ ఆధార్‌తో రేషన్ దుకాణానికి హాజరై వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. ఒక వేళ లబ్ధిదారుడు ఆధార్ నవీకరణ ఇది వరకే చేసుకుంటే ఆ విషయాన్ని రేషన్ దుకాణంలో తెలియజేయాల్సి ఉంటుంది. ఈ కేవైసీ చేయించుకోని వారి పేర్లను హోల్డ్‌లో పెడుతున్నారు. అప్పుడు వేలి ముద్ర వేసిన వారి పేర్లే కనిపిస్తుంటాయి.

రేషన్ ఈ-కేవైసీకి 2023 డిసెంబరు 31 ఆఖరు కాగా.. అప్పటి వరకు సగం మంది కూడా ఈ-కేవైసీ ఇవ్వకపోవడం ప్రభుత్వం ఫిబ్రవరి వరకు పొడిగించింది. ఇప్పటి వరకు జిల్లాలో 85.46 శాతం మాత్రమే లబ్ధిదారులు ఆన్‌లైన్ చేయించుకున్నారు. సిద్దిపేటరూరల్ మండలంలో 88.68, సిద్దిపేట అర్బన్ 83.36, అక్కన్నపేట 89.04, బెజ్జంకి 85.87, చేర్యాల 84.07, చిన్నకోడూరు 88.59, దౌల్తాబాద్ 84.43, దుబ్బాక 87.91, గజ్వేల్ 83.91, హుస్నాబాద్ 87.01, జగదేవ్‌పూర్ 81.57, కోహెడ 86.28, కొమురవెల్లి 87.64, కొండపాక 87.64, మద్దూరు 84.48, మర్కుక్ 81.12, మిరుదొడ్డి 86.27, ములుగు 82.53, నంగునూరు 87.22, రాయపోల్ 87.17, తొగుట 82.93, వర్గల్ 87.93, నారాయణరావుపేట 88.49, దూల్మిట్ట 83.92 శాతం లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 85.46 శాతం ఈకేవైసీ కాగా, మిగిలిన వారి కోసం ప్రభుత్వం మరో అవకాశం ఇస్తుందా, లేదా ఆ యూనిట్లను తొలగిస్తుందా? అనేది వేచిచూడాలి.



ఈకేవైసీ నమోదును పరిశీలిస్తున్న జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తనూజ శ్రీ (ఫైల్)

రేషన్ బియ్యానికి రెక్కలు

- గ్రామాల్లో పోటీపడి కొంటున్న వ్యాపారులు
- శివారు ప్రాంతాల్లో రహస్యంగా డంప్ చేస్తున్న వైనం
- పట్టుబడిన నామమాత్రపు చర్యలే!!


చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ శివారులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న బియ్యం (ఫైల్)

చిన్నకోడూరు, మార్చి 27: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యానికి రెక్కలొచ్చాయి. ఒకప్పుడు కిలో రూ.10-12 వరకు దొంగచాటుగా కొనే వ్యాపారులు ఇప్పుడు ధరను అమాంతం పెంచేశారు. ప్రతినెలా రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారుల్లో కొందరు ఆ బియ్యాన్ని అమ్ముకుంటున్నారు. ఇక గ్రామాల్లో వ్యాపారులు ఇంటింటికీ తిరుగుతూ కిలో రూ. 15 -20 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. అలా కొనుగోలు చేసిన బియ్యాన్ని గ్రామాల శివారుల్లో రహస్యంగా డంప్ చేస్తున్నారు. అనంతరం ఒకేసారి బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పౌరసరఫరాలు, రెవెన్యూశాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు అధికారులు పట్టించుకోకపోవడం వల్ల రేషన్‌దందా జోరుగా సాగుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

తల్లిబిడ్డల సంరక్షణ ప్రభుత్వ లక్ష్యం

- సిద్దిపేట జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్
- గజ్వేల్ మాతాశిశు ఆసుపత్రిని సందర్శన
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గజ్వేల్, మార్చి 27 : తల్లిబిడ్డల సంరక్షణ ప్రభుత్వ లక్ష్యమని సిద్దిపేట జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన "ఆస్పత్రి.. ఓపీ కోసమేనా?" అన్న కథనానికి స్పందించి గజ్వేల్‌లోని మాతాశిశు ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రి ప్రారంభానికి కావాల్సిన పరికరాలు, ఇతర వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆపరేషన్ థియేటర్, లేబర్ రూంలో కొన్ని పరికరాలు సమకూరిస్తే వెంటనే ఐపీని ప్రారంభించవచ్చని ఆయన తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ దృష్టికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. అనంతరం గజ్వేల్‌లోని ఆసుపత్రిని సందర్శించి అక్కడ అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్న ఆయన.. సిబ్బంది, వైద్యులతో సమీక్ష నిర్వహించారు. తల్లిబిడ్డల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, గర్భిణులకు తక్షణ వైద్యసేవలందించాలన్నారు. పుట్టిన బిడ్డలకు వ్యాధి నిరోధక టీకాలను వెంటనే అందజేయాలని చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, వైద్యులు మంజుల, నర్సింహులు, సిబ్బంది పలువురు ఉన్నారు.


గజ్వేల్ ఎంసీహెచ్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్, డీసీహెచ్‌వో సాయికిరణ్

మల్లన్నగుట్టల్లో మరో వివాదం

- విద్యుత్‌శాఖకు అటవీశాఖ నోటీసులు
- తమ భూముల్లో కరెంట్ ఎలా ఇస్తారని..
- కనెక్షన్ తొలగించిన అధికారులు

దుబ్బాక, మార్చి27: దుబ్బాక మల్లికార్జున స్వామి దేవాలయం వివాదాలకు నిలయంగా మారుతోంది. వారం క్రితం ఒగ్గుపూజారుల మధ్య ఘర్షణ జరగగా, తాజాగా తమ భూముల్లో విద్యుత్ కనెక్షన్ ఎలా ఇచ్చారంటూ అటవీ శాఖ అధికారులు విద్యుత్ శాఖకు నోటీసులు ఇచ్చారు. మల్లన్నగుట్టలోని మల్లికార్జున స్వామి ఆలయ భూముల విషయంలో అటవీశాఖ, దేవాదాయ శాఖ మధ్య వివాదం ఉంది. మల్లికార్జున దేవాలయం, రేణుకా దేవాలయం మినహా మిగితా స్థలం మొత్తం రిజర్వు ఫారెస్ట్ పరిధిలోకి వస్తుందని అటవీశాఖ అంటోంది. ఈమేరకు అధికారులు పలుమార్లు సర్వే చేసి, హద్దు రాళ్లను పాతారు. కేవలం ఎకరంన్నర భూమి మాత్రమే దేవాదాయ శాఖ పరిధిలో ఉండగా, సుమారు ఎనిమిది ఎకరాలు రిజర్వు ఫారెస్ట్ భూములను ఆక్రమించిందని అప్పట్లో నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో దేవాలయ సత్రాలను, కార్యాలయాలను, దుకాణాలను పలుమార్లు కూల్చి వేశారు. ఆలయానికి రాకపోకలకు కనీసం దారి కూడా లేదని ఆంక్షలు విధించారు. స్థానికుల ఒత్తిడి మేరకు ఎట్టకేలకు రాజక్కపేట గ్రామం నుంచి రహదారిని వేశారు. ఏటా లక్షలాది మంది భక్తులు వచ్చే దేవాలయం దుబ్బాక పట్టణ శివారులో ఉంటుంది. అయితే, దుబ్బాక నుంచి ఆలయానికి రహదారి లేకపోవడంతో పనికి ఆహార పథకం కింద 2001లో మునీశ్వర్ల నుంచి రహదారిని నిర్మించారు. దీనిపై కూడా అటవీ శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ అటవీశాఖ అధికారులు అప్పటి మల్లయపల్లి సర్పంచ్‌పై కేసు కూడా పెట్టారు. దీంతో రహదారి అర్ధాంతరంగానే మిగిలిపోయింది. భక్తులు సుమారు 7 కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రహదారి పూర్తి చేస్తూ భక్తులకు దూరాభారం తగ్గుతుందని స్థానికులు పలుమార్లు అటవీశాఖ అధికారులను కోరినా అనుమతులు రాలేదు.

తాజాగా మరోసారి..

ఆలయ ప్రాంగణంలో ఎనిమిది దుకాణాలు(గుడిసెలు) ఏర్పాటు చేశారు. అక్కడ పార్కింగ్ కోసం దేవాదాయ శాఖ బహిరంగ వేలం ప్రకటన ఇవ్వగా, అటవీశాఖ అధికారులు వాటినీ అడ్డుకున్నారు. చివరికి తాత్కాలికంగా వేసిన గుడిసెలకు కరెంట్ కనెక్షన్ ఎలా ఇస్తారంటూ వారం రోజుల క్రితం విద్యుత్ అధికారులకు అటవీశాఖ నోటీసులు జారీ చేసింది. అటవీశాఖ పరిధిలో అక్రమంగా వేసుకున్న గుడిసెలకు కరెంట్ ఎలా ఇస్తారని, వెంటనే తొలగించకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో బుధవారం రాత్రి స్థానిక విద్యుత్ ఏఈ పర్యవేక్షణలో దుకాణాలకు ఇచ్చిన విద్యుత్ కనెక్షన్‌లను తొలగించారు.

మెదక్ జిల్లా కోర్టులో ఈ-సేవ కేంద్రం

- వర్చువల్‌గా ప్రారంభించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్



మెదక్ కోర్టు ఆవరణలో ప్రారంభమైన ఈ-సేవ కేంద్రం

మెదక్ అర్బన్, మార్చి27: మెదక్ జిల్లా కోర్టు ఆవరణలో ఈ-సేవ కేంద్రం ఏర్పాటైంది. బుధవారం వర్చువల్‌గా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ప్రారంభించారు. ఈ కేంద్రంతో ప్రస్తుతం కేసులు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. కోర్టు ఉత్తర్వుల సాఫ్ట్ కాపీలను వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా పొందవచ్చు. ఈ-కోర్టు మొబైల్ యాప్ డౌన్‌లోడింగ్, సర్టిఫైడ్ కాపీలు, పిటిషన్లు, కౌంటర్ల ఈ-ఫైలింగ్, ఈ-సంతకాలు పొంది, వాటిని అప్‌లోడ్ చేయొచ్చు. న్యాయసేవాధికార సంస్థల నుంచి ఉచిత న్యాయసేవలు పొందేందుకు వీలుంది. అందరికీ న్యాయం అందుబాటులో ఉండాలన్న రాజ్యాంగ లక్ష్యాన్ని నెరవేర్చాలని సుప్రీంకోర్టు ఈ-కమిటీ నిర్ణయించిన మేరకు అన్ని జిల్లాల్లోని జిల్లా కోర్టుల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ జితేందర్, జూనియర్ సివిల్ జడ్జి రీటా లాల్‌చంద్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగసుశీల, న్యాయవాది కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం


గాయపడిన మహిళను అంబులెన్స్‌లో తరలిస్తున్న స్థానికులు

- వధువును తీసుకొచ్చేందుకు వెళ్తుండగా ప్రమాదం
- జోగిపేట వద్ద బోల్తా పడ్డ ట్రాక్టర్
- వరుడి తరపున బంధువులు ముగ్గురు దుర్మరణం
- బోసిబోయిన బాచారం

పాపన్నపేట/జోగిపేట, మార్చి 27: పెళ్లి బాజాలు మోగాల్సిన ఇంట్లో శ్మశాన నిశబ్ధం అలుముకుంది. అప్పటి వరకు ఉత్సాహంగా.. సంతోషంగా బంధువులతో సందడిగా ఉన్న ఆ ఇల్లు ఏడుపులు.. పెడబొబ్బలతో మారుమోగిపోయింది. తెల్లవారితే పెళ్లి జరుగుతుందని భావించిన ఆ కుటుంబం ఇప్పుడు కల్యాణ మండపంలో కాకుండా ఆస్పత్రిలో కొందరు తమ బంధువుల మృతదేహాల వద్ద మరికొందరు క్షతగాత్రుల వద్ద పడిగాపులు పడుతున్నారు. మెదక్ జిల్లా అందోల్ మండలం మాన్‌సాన్‌పల్లి శివారు మూలమలుపు వద్ద పెళ్లి ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో వరుడు తరుపున బంధువులు ముగ్గురు మృతి చెందారు. ఈ ప్రమాదంలో చిన్నారులతో సహా 20 మంది వరకు గాయపడ్డారు. జిల్లాలోని పాపన్నపేట మండలం బాచారం గ్రామానికి చెందిన సుంద పోచయ్య-శ్యామమ్మ కుమారుడు రాములుకు సంగారెడ్డి జిల్లా అందోలు పట్టణానికి చెందిన పూజారి యాదయ్య కుమార్తెతో గురువారం పెళ్లి జరగనుండగా.. బంధువులంతా వచ్చేశారు. ఇంట్లో పెళ్లి సందడి నెలకొనగా.. వారి ఆచారం ప్రచారం పతానం అనే కార్యక్రమం జరిపి వధువు.. వరుడి ఇంటికి తీసుకువచ్చేందుకు సుమారు 29 మంది వరుడి తరపు బంధువులు ఓ ట్రాక్టర్‌లో వధువు గ్రామానికి బయలుదేరారు. అయితే, ఇందులో ముగ్గురికి అదే చివరి ప్రయాణం అవుతుందని ఊహించలేదు. మార్గమధ్యలో సంగారెడ్డి జిల్లా అందోలు మండలం మన్‌సాన్‌పల్లి శివారులోని మూలమలుపు వద్ద.. అతి వేగంతో ఉన్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ట్రాక్టర్ ట్రాలీ బోల్తా కొట్టింది. దీంతో బాచారం గ్రామానికి చెందిన రావుగారి బూదమ్మ(52), జెట్టిగారి సంగమ్మ(45) చనిపోగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రావుగారి ఆగమ్మ(45) చనిపోయారు. సుమారు 20 మంది వరకు గాయపడగా.. ఒకరిద్దరి పరిస్థితి విషమంగా ఉంది. రెండేళ్ల చిన్నారితో సహా పలువురు చిన్నారులూ గాయపడటంతో ఆ ప్రాంతం అంతా రోదనలతో నిండిపోయింది. ట్రాక్టర్ ఒక్కసారిగా బోల్తా పడటంతో ఏం జరిగిందో అర్థం అయ్యే లోపల ఇద్దరు చనిపోయారు. ఆగమ్మ అనే మహిళ ఆస్పత్రిలో కన్నుమూసింది. పెండ్లి కుమారుని అమ్మమ్మ, చిన్నమ్మకు కూడా తీవ్ర గాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు.

నెలరోజుల క్రితమూ..

సరిగ్గా నెల రోజుల క్రితం శుభకార్యానికి వెళ్లి వస్తూ ఇదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృత్యువాత పడ్డారు. ఆ ఘటన మరువక ముందే శుభకార్యానికి వెళ్తూ మరో ముగ్గురు చనిపోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

మృతిచెందిన వారు


బూదమ్మ(ఫైల్)


సంగమ్మ(ఫైల్)


ఆగమ్మ(ఫైల్)

మూగపోయిన వరుడి ఇల్లు

నూతన వధువును తీసుకొచ్చేందుకు వెళ్లిన బంధువులు చనిపోయారనే విషయం తెలియగానే రెండు ఊర్లలో విషాదం అలుముకున్నది. వరుడి ఇంటి వద్ద ఉన్న వారంతా సంఘటనా స్థలానికి, అక్కడి నుంచి ఆస్పత్రులకు వెళ్లడంతో ఆ ప్రాంతమంతా బోసిపోయింది. చనిపోయిన వారి మృతదేహాలు జోగిపేట ఏరియా ఆస్పత్రిలో ఉండగా, గాయపడిన వారిలో కొందరిని సంగారెడ్డి ఏరియా ఆస్పత్రికి, హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు.


బోసిపోయిన వరుడి ఇల్లు

కరువు తెచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వం

- ప్రజాసమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్
- అకాల వర్షానికి దెబ్బతిన్న పంటల పరిశీలన

7లో..


లక్ష్మీపూర్‌లో అకాల వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వినోద్‌కుమార్

ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలి

గజ్వేల్, మార్చి 27: ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని గజ్వేల్ ఆర్డీవో బి.బన్సీలాల్ ప్రజలకు పిలుపునిచ్చారు. గజ్వేల్‌లోని అంబేడ్కర్ సర్కిల్‌లో బుధవారం స్వీప్ ఆధ్వర్యంలో ఫ్లాష్‌మాబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని, భారతదేశ ప్రజలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కు ఓటు అని అన్నారు. ఆ ఓటుహక్కును వినియోగించుకుని సరైన నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. ఓటుశాతం పెరిగేందుకు ప్రతి ఒక్కరూ దోహదం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట గజ్వేల్ తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ బి.సైదా, డిప్యూటీ తహసీల్దార్లు భార్గవ్‌సాగర్, భాస్కర్, ఆర్ఐ కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.


గజ్వేల్‌లో ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో బన్సీలాల్

కొత్త భవనాలకు ఆస్తి పన్నులు లేవా?

జహీరాబాద్, మార్చి 27: జహీరాబాద్ పట్టణం అంతకంతకు విస్తరిస్తున్న నేపథ్యంలో నూతన భవనాలు కూడా అదేస్థాయిలో వెలిశాయని, ఆ భవనాలకు పన్నులు వేయకపోవడమేంటని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ నామ కిరణ్ ప్రశ్నించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు ఎంతసేపూ పాత భవనాల చుట్టూ తిరుగుతూ పన్నులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని, నూతనంగా నిర్మితమైన పెద్ద భవనాల విషయం ఊసెత్తకపోవడం దారుణంగా ఉన్నదన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

నారాయణఖేడ్, మార్చి 27: నీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ అన్నారు. బుధవారం ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలో బోరు బావుల రీ డ్రిల్లింగ్ పనులను వైస్ చైర్మన్ దారం శంకర్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఈ సంవత్సరం ఎండల తీవ్రత అధికంగా ఉన్నదని, అందువల్ల ముందస్తుగానే నీటి ఎద్దడి పరిస్థితులను గుర్తించి అవసరమైన చర్యలను చేపడుతున్నామన్నారు. ప్రజలు కూడా నీటిని పొదుపుగా వాడుకొని సహకరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వివేకానంద్, సవితాహన్మాండ్లు, నాయకులు శెట్టిశంకర్, చేతన్, బాలయ్య లక్ష్మయ్య సిబ్బంది పాల్గొన్నారు.



బోరు బావి రీ డ్రిల్లింగ్ పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్

కరువు తెచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వం..

● కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్



లక్ష్మీపూర్‌లో ఎండిపోయిన పంటలను పరిశీలించి మహిళా రైతుతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్


బెజ్జంకి, మార్చి 27: నీరు లేక పంటలు ఎండిపోవడం లేదని, నీరు ఎక్కడ ఇవ్వాలి.. ఎప్పుడు ఇవ్వాలనే విషయాన్ని ప్రభుత్వం ఆలోచించాలని.. అసలు కరువు తెచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ఆరోపించారు. బుధవారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మిడ్ మానేరు నుంచి 02 టీఎంసీల నీటిని అన్నపూర్ణ (అనంతగిరి) ప్రాజెక్టులో వదిలి బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల్లోని చెరువులు, కుంటలు నింపితే రైతులు కోట్లాది రూపాయాల పంట పండించుకునేవారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో చెరువులు, కుంటలు నింపడంతో బోరు బావుల్లో నీరు ఉండి మోటార్‌లతో పంటలకు నీరు పారించుకున్నామని రైతులు చెబుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే మేడిగడ్డ వద్ద మరమ్మతులు చేపట్టి ఒక కాఫర్ డ్యాం కట్టి నీటిని ఎత్తిపోస్తే ఎల్ఎండీ, మిడ్ మానేరు నిండేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చెప్పి ఇంతవరకు చేయకపోవడంతో రైతులు తీసుకున్న రుణాలను కట్టాలని బ్యాంకు అధికారులు ఒత్తిడి తెస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పై బ్యాంకులకు గ్యారంటీ ఇచ్చి బ్యాంకుల అధికారులు గ్రామాల్లోకి రాకుండా, రుణాలు కట్టాలని రైతులకు ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు. అకాల వర్షానికి పంటలు దెబ్బతిని నష్టపోయామని ఇప్పుడు కట్టలేని పరిస్థితిలో ఉన్నామని రైతులు చెబుతున్న పుస్తెల తాళ్లు అమ్మి అయిన సరే రుణాలు కట్టాలని బ్యాంకు అధికారులు వేధించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుదని రైతులు అధైర్యపడవద్దని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆలయ ద్వారాలు

29 నుంచి లక్ష్మీనృసింహస్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు

● తరలిరానున్న వేలాదిమంది భక్తులు
● ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు



ఆలయంలో కొలువైన మూలవిరాట్ లక్ష్మీనృసింహస్వామి

వర్గల్, మార్చి 27: వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ఈనెల 29 నుంచి ప్రారంభంకానున్నాయి. ఉత్సవాల సందర్భంగా క్షేత్రంలోని ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ పరిసరాలు, ప్రాంగణమంతా రంగులతో మెరుగులు దిద్దారు. ఆలయం చుట్టూ కొబ్బరి మట్టలు, మామిడి తోరణాలు అలంకరింపజేశారు. స్వామివారిని భక్తులు దర్శించుకునే విధంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. క్షేత్రంలో అక్కడక్కడ తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నాచగిరి క్షేత్రం పరిధిలోని తూప్రాన్, గజ్వేల్ వెళ్లే రహదారిపై, హైదరాబాద్ నుంచి సిద్దిపేట వేళ్లే రాజీవ్ రహదారి ప్రజ్ఞాపూర్ వద్ద స్వాగత తోరణం ఏర్పాటు చేశారు.

ప్రత్యేక బస్సులు

నాచగిరి నృసింహస్వామి క్షేత్రంలో బ్రహోత్సవాల సందర్భంగా ఆర్టీసీ వారు భక్తుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. మేడ్చల్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, హైదరాబాద్, సికింద్రాబాద్ డిపోల నుంచి నాచగిరి క్షేత్రం వరకు స్పెషల్ బస్సులు ఏర్పాటు చేశారు. నాచగిరి క్షేత్రంలో జరిగే నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.అన్నపూర్ణ తెలిపారు. ఈనెల 29న ప్రారంభమయ్యే ఉత్సవాలు ఏప్రిల్ 9న శత ఘటాభిషేకం, ఉగాది పండుగతో ముగియనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా క్షేత్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వృక్షశాస్త్ర జాతీయ సదస్సు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ డీఎస్ఆర్ రాజేందర్‌సింగ్

సిద్దిపేట క్రైం, మార్చి 27: సిద్దిపేట పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో వృక్షశాస్త్ర విభాగంలో రెండురోజులపాటు జరగనున్న జాతీయ సదస్సులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా జాయింట్ డైరెక్టర్ కమిషనర్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డీఎస్ఆర్ రాజేందర్‌సింగ్ హాజరై మాట్లాడారు. జీవవైవిధ్యం ప్రాముఖ్యతను వివరించారు. జీవవైవిధ్యం విధ్వంసం కాకుండా చూడాలని కోరారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బోటనీ కాకతీయ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రామిరెడ్డి మాట్లాడుతూ మొక్కలను పెంచడం వల్ల వాతావరణ కాలుష్యాన్ని నిర్మూలించవచ్చని, గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించవచ్చని సూచించారు. అనంతరం ప్రొఫెసర్ ముస్తఫా మాట్లాడుతూ జీవవైవిధ్యాన్ని సహజ పరిస్థితులను ఉపయోగించి ఏ విధంగా రక్షించవచ్చు అనే అంశాన్ని వివరించారు. ఇస్రో సీనియర్ సైంటిస్ట్ సుధాకర్‌రెడ్డి ఫ్లోరా, ఫనాల గురించి తెలియజేశారు. హెడ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బోటనీ తెలంగాణ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ అరుణ ప్లాంట్ సైన్సెస్ ఈ రోజుల్లో విద్యార్థులకు అన్నివిధాలుగా ఉపయోగపడుతున్నదని తెలియజేశారు. ఈ జాతీయ సదస్సుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర,కేరళ, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి పరిశోధకులు హాజరయ్యారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం

చేర్యాల, మార్చి 27: కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కల్వర్టు నిర్మాణం కోసం చేపట్టిన తవ్వకంలో బుధవారం మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసమైంది. గ్రామశివారులోని గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు అనుసంధానంగా ఏర్పాటుచేసిన పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీరు కొంత సేపు ఎగిసిపడింది. దీంతో ఎక్స్‌కవేటర్ బకెట్ అడ్డుపెట్టి నీటి ప్రవాహాన్ని నిలువరించే ప్రయత్నం చేశారు. నీటి సరఫరా నిలిపేయడంతో తవ్వకం పనులు తిరిగి చేపట్టారు.

2030 నాటికి మానవ మేధస్సుతో సరిపోలే కృత్రిమ మేధస్సు

● హెదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సిబా ఉద్గత



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పటాన్‌చెరు రూరల్, మార్చి 27: 2030 నాటికి మానవ మేధస్సుతో కృత్రిమ మేధ (ఏఐ) సరిపోలుతుందని, ప్రస్తుతం అది మనం నిర్దేశించిన పని చేయడానికే పరిమితమైందని హెదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, ఏఐలో ప్రఖ్యాత నిపుణుడు డాక్టర్ సిబా ఉద్గత అంచనా వేశారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండురోజుల జాతీయ కార్యశాల ప్రారంభోత్సవం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఆర్టిఫీషియల్ జనరల్ ఇంటలిజెన్స్ సాధించడానికి సాధారణ జ్ఞానంతో కూడిన కృత్రిమ మేధ నమూనాలను అభివృద్ధి చేయడం ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. సమాచార (డేటా) సేకరణలో గోప్యత, భద్రత, న్యాయబద్ధతల ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ, బాధ్యతాయుతమైన కృత్రిమ మేధ అభివృద్ధి ఆవశ్యకతను చెప్పారు. కృత్రిమ మేధలో శోధించేవారు, తాము కనుగొన్నది సమాజంపై చూపే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సమస్యను గుర్తించి, దానిని నిర్వహించి, అందుకు తగ్గ పరిష్కారాలను చూపాలని విద్యార్థులను ప్రోత్సహించారు. భారతీయ నిపుణులు సమస్యకు పరిష్కారం కనుగొనడంలో దిట్ట అయినా, దానిని గుర్తించి, నిర్వచించడంలో వెనుకబడినట్టు డాక్టర్ ఉద్గత పేర్కొన్నారు. వేగంగా మారుతున్న కృత్రిమ మేధ రంగంలో పునఃనైపుణ్యం పొందం, నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం ఆవశ్యకతను జియో ప్లాట్ ఫారం ప్రిన్సిపల్ డేసైంటిస్ట్ డాక్టర్ ఆకాంక్ష కునూర్ చెప్పారు. ఈ రంగంలో రాణించాలంటే, పరిశ్రమ భాగస్వామ్యంతో నిరంతర అభ్యాసంతోపాటు ఇతరులతో కలిసి పనిచేయాలని సూచించారు. ట్రిబుల్ ఐటీ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ రాధికా మామిడి, ఆవిష్కరణల సాకారంలో యువత పాత్రను తెలిపారు. భవిష్యత్ గురించి విద్యార్థులకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. వర్చువల్ సభాధ్యక్షత వహించిన గీతం సైన్ డీన్ ప్రొఫెసర్ కొల్లూరు శ్రీకృష్ణ మాట్లాడుతూ, గణితం, కృత్రిమ మేధ పరిశోధనలో కొత్త మార్గాలను అన్వేషించాలని, ఈ కార్యశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దాదాపు 150 మంది పాల్గొన్న ఈ వర్క్‌షాప్, కృత్రిమ మేధ, పెద్ద భాషా నమూనాలలో తాజా పురోగతులపై చర్చ, పరస్పర సహకారానికి వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కార్యశాల నిర్వాహకుడు డాక్టర్ మోతహర్ రెజా, సమన్వయకర్తలు డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి, డాక్టర్ కృష్ణ, కుమ్మరి తదితరులు పాల్గొన్నారు.

దేవాదుల కెనాల్‌లో పోసిన మట్టి తొలగింపు

● కొండపాక మండలానికి నీటి విడుదలకు లైన్‌క్లియర్
● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



తపాస్‌పల్లి కెనాల్‌లో వేసిన మట్టిని తొలగిస్తున్న దృశ్యం

చేర్యాల/కొండపాక, మార్చి 27: కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలానికి సాగునీరు రాకుండా మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో రిజర్వాయర్ డీ4 కెనాల్‌లో వేరే ప్రాంతానికి చెందిన కొంతమంది మట్టిపోసి అడ్డుకట్ట వేశారు. ఈనెల 23న 'కెనాల్‌కు అడ్డుకట్ట.. సాగునీటి గోస' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై అధికారులు స్పందించి కాలువలో పోయించిన మట్టి, మొరాన్ని బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా దేవాదుల ఏఈఈ రాజశేఖర్, కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు పోలీసు బందోబస్తు నడుమ ఎక్స్‌కవేటర్లతో మట్టిని తొలగింపచేశారు. కొద్దిరోజుల క్రితం దేవాదుల గంగారం నుంచి పంపింగ్ ప్రారంభించగా, బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీటిని మళ్లించారు. రెండురోజుల క్రితం నీటి పంపింగ్ నిలిచిపోగా, బుధవారం తిరిగి పంపింగ్ ప్రారంభించారు. చేర్యాల ప్రాంతంలో పంటలు ఎండిపోతుండగా ముందస్తుగా ఇక్కడి రైతులకు నీటి విడుదల చేసిన అనంతరం కొండపాకకు మళ్లించాలని స్థానిక రైతులు కోరడంతో కొద్దిరోజుల క్రితం కాలువలో మట్టిపోయించడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయమై రాజకీయ ఒత్తిళ్లతో మట్టిని తొలగింప చేయడంతో కొండపాక మండలానికి నీటి తరలింపునకు అడ్డంకులు తొలగిపోయాయి. ఇదిలా ఉండగా కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ కొమురవెల్లి మండల నాయకులు బుధవారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా మల్లన్న ఆలయ డైరెక్టర్ మేడికుంట శ్రీనివాస్, నాయకులు ఎక్కలదేవి శ్రీనివాస్, పబ్బోజు రాములుచారి, గొల్లపల్లి శ్రీనివాస్, పోతుగంటి రవి తదితరులు హైదరాబాద్‌లో కొమ్మూరిని కలిశారు. చేర్యాల ప్రాంతంలో పంటలు ఎండిపోకుండా రైతులను ఆదుకునేందుకు సాగునీటిని అందించేలా సంబంధిత అధికారులతో సంప్రదించి పరిష్కరించాలని కోరారు. దీంతో కొమ్మూరి సానుకూలంగా స్పందించారు.

871 మంది కుష్టు అనుమానితులు

● వెంటనే చికిత్స ప్రారంభానికి చర్యలు
● 544 బృందాలతో ఇంటింటి సర్వే
● 6,91,408 మందికి స్క్రీనింగ్.. ముగిసిన సర్వే

మెదక్ అర్బన్, మార్చి 27: మెదక్ జిల్లావ్యాప్తంగా కుష్టు(లెప్రసీ) సర్వేలో విస్తుపోయే నిజాలు వెలుగు చూస్తున్నాయి. కేంద్ర సర్కార్ అనుమానించినట్లే వేగంగా ఈ వ్యాధి విస్తరిస్తోంది. అంతరించి పోయిందనుకున్న తరుణంలో చాపకింద నీరులా వ్యాధి విస్తరిస్తున్నట్లు తేలుతుండడం గమనార్హం. 544 బృందాలతో ఈనెల 13 నుంచి బుధవారం వరకు చేపట్టిన ఇంటింటి సర్వేలో జిల్లాలోని 1,76,408 గృహాల్లో 6,91,240 మందిని స్క్రీనింగ్ చేశారు. ప్రతి వ్యక్తిని పూర్తిస్థాయిలో పరీక్షించారు. అందులో 871 మందికి కుష్టు అనుమానిత లక్షణాలున్నట్లు గుర్తించారు. అనుమానితులను వ్యాధి నిర్ధారణ కోసం వైద్యుల వద్దకు సిఫారసు చేశారు. 519 మందిని పరీక్షించగా.. ఇంకా 361 మందిని పరీక్షించున్నారు. ఇప్పటి వరకు కొత్తగా 8 పాజిటివ్ కేసులు నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే చికిత్స ప్రారంభించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ చర్యలు చేపడుతుంది. ఇంటింటి సర్వే విజయవంతంగా ముగిసిందని ఆశాఖ అధికారులు తెలిపారు.

ఘనంగా ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే

సంగారెడ్డి అర్బన్, మార్చి 27: సంగారెడ్డి శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే బుధవారం నిర్వహించారు. సీనియర్ కేజీ విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ అవార్డుల పురస్కారాలు ప్రదానం చేశారు.

తపాస్‌పల్లిలో బండరాళ్ల బ్లాస్టింగ్‌పై అధికారుల విచారణ

● డ్రిల్లింగ్ మిషన్ ఇతరత్రా సామగ్రి సీజ్



విచారణ చేస్తున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మైనింగ్ అధికారి సైదులు, ఎస్ఐ నాగరాజు

చేర్యాల, మార్చి 27: కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామ శివారులోని అసైన్డ్ భూమిలో అనుమతులు లేకుండా పలువురు బండరాళ్లు కొడుతూ విక్రయిస్తున్న విషయమై అదే గ్రామానికి చెందిన రమేశ్ చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం అధికారులు విచారణ చేపట్టారు. కొమురవెల్లి తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సైదులుయాదవ్, ఎస్ఐ నాగరాజు ఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా బండరాళ్ల బ్లాస్టింగ్ చేయకూడదని, అక్రమంగా విక్రయించడం తప్పని నిర్వాహకులకు సూచించారు. వెంటనే పనులు నిలిపివేయాలని ఆదేశించి డ్రిల్లింగ్ మిషన్, ఇతరత్రా సామగ్రిని సీజ్ చేశారు. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని, వారి ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

బైకులు దొంగిలించిన అంతర్రాష్ట్ర పాత నేరస్థుడి అరెస్ట్

● 3 సెల్‌ఫోన్లు, 18 బైకులు స్వాధీనం, బ్యాంకు ఖాతా ఫ్రీజ్



నేరస్థులతో క్రైమ్ టీం ఎల్బీనగర్ ఏసీపీ ఏ.కృష్ణయ్య, ఎస్‌హెచ్‌వో ఎల్.రామాంజనేయులు, డీఐ ఏ.సుధాకర్

కొత్తపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసైన కారు డ్రైవర్ పలు నేరాల పాల్పడి జైలు ఊచలు లెక్కించి వచ్చి, బైకుల దొంగతనాలు మొదలుపెట్టాడు. ఫేస్‌బుక్ ఫ్రెండ్ సహకారంతో వాటిని విక్రయిస్తూ ఎల్బీనగర్ పోలీసులకు చిక్కాడు. ఆ ఇద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకొని 3 సెల్‌ఫోన్లు, 18 బైకులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఎల్బీనగర్ డివిజన్ ఏసీపీ ఏకృష్ణయ్య తమ కార్యాలయంలో బుధవారం కేసుల వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప, ప్రొద్దటూరు వాజ్‌పేయినగర్ వాసి అయిన మల్లె భరత్‌కుమార్(28) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో చెడు అలవాట్లకు బానిసై నేరాల బాటపట్టాడు. ఆంధ్రప్రదేశ్‌లో అతడిపై 14 కేసులు నమోదయ్యాయి. 2022లో ప్రొద్దటూరులో పోక్సో కేసు, గతేడాది కాజీపేట పీఎస్‌లో ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడిన కేసులు 9, బద్వేల్‌లో 4 బైకు చోరీల కేసులు నమోదయ్యాయి. బద్వేల్ సబ్ జైలు నుంచి విడుదలైన భరత్ మలక్‌పేట మూసారాంబాగ్‌కు మకాం మార్చాడు. మెట్రోస్టేషన్లు, ఇళ్ల బయట పార్క్ చేసిన కొత్త పల్సర్ బైకుల లాక్‌ను మాత్రమే విరగ్గొట్టి దొంగిలించడం మొదలుపెట్టాడు. ఈ ఏడాది మూడు కమిషనరేట్ల పరిధిలో 18 పల్సర్ బైకులను దొంగిలించాడు. నారాయణపేట మరికల్, రాకొండ గ్రామానికి చెందిన వలిమోని చెన్నయ్య అలియాస్ కిట్టు(22) సంగారెడ్డి బీడీఎల్ భానూరు, ఏదుల నాగులపల్లిలో ఉంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భరత్‌కుమార్‌కు అతడు ఫేస్‌బుక్‌లో పరిచయమయ్యాడు. భరత్‌కుమార్ దొంగిలించిన బైకులను అతడు కొనుగోలు చేసి రూ.30 నుంచి రూ.40 వేలుకు విక్రయించేవాడు.

17న ఎల్బీనగర్ మెట్రోస్టేషన్ పార్కింగ్ వద్ద

ఈ నెల 17న ఎల్బీనగర్ మెట్రో వెహికల్ పార్కింగ్ వద్ద ఓ పల్సర్ బైకు చోరీ గురైందని ఫిర్యాదు అందడంతో క్రైమ్ టీం అప్రమత్తమై నేరస్థుడి కదలికలపై సాంకేతికంగా నిఘా పెట్టింది. మెట్రో పార్కింగ్ వద్ద దొంగిలించిన పల్సర్ బైకును భరత్‌కుమార్ డీవీఎం కాలేజీ వెనుక దాచేశాడు. దాన్ని మంగళవారం ఓ వ్యక్తికి విక్రయిచేందుకు/అందజేసేందుకు భరత్‌కుమార్ డీవీఎం కాలేజీ వద్దకు వచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని, బైకును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. బీడీఎల్ భానూరు నుంచి కిట్టు తన స్నేహితులను కలిసేందుకు మీర్‌పేటకు వచ్చేవాడు. అదే సమయంలో భరత్‌కుమార్ చోరీ చేసిన బైకుల విక్రయానికి సహకరించేవాడు. భరత్‌కుమార్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు అతడిని బీడీఎల్ భానూరులో అదుపులోకి తీసుకున్నారు. భరత్‌కుమార్ చోరీచేసిన 17 బైకులను, కిట్టు వద్ద ఒక బైకును స్వాధీనం చేసుకున్నారు. వీటిలో కొన్ని బైకులకు రిజిస్ట్రేషన్ కూడా చేయించలేదు. కిట్టు బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.22,205లనూ ఫ్రీజ్ చేశారు. భరత్‌కుమార్‌పై రాచకొండ కమిషనరేట్ పరిధిలో 10 బైక్ చోరీ కేసులు, హైదరాబాద్ పరిధిలో 7 కేసులు, సైబరాబాద్ మియాపూర్ పీఎస్ పరిధిలో ఒక కేసు నమోదయ్యాయి. దొంగలను పట్టుకునేందుకు/గుర్తించేందుకు ఇళ్ల వద్ద, వాహనాల పార్కింగ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీ కష్ణయ్య సూచించారు. సమావేశలో ఎస్‌హెచ్‌వో ఎల్.రామాంజనేయులు, డీఐ ఏ.సుధాకర్, క్రైమ్ టీం పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రికి తాళం!

● రెండేళ్ల అద్దె డబ్బులివ్వాలని సిబ్బందితో భవన యజమాని వాగ్వాదం
● త్వరలో అందించేలా కృషిచేస్తామని హామీ ఇచ్చిన వైద్యసిబ్బంది



పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రికి తాళం వేస్తున్న యజమాని

జహీరాబాద్, మార్చి 27: జహీరాబాద్ పట్టణంలోని ఈఎస్ఐ డిస్పెన్సరీకి ఆ శాఖ రెండేళ్లుగా అద్దె డబ్బులు చెల్లించకపోవడంతో బుధవారం భవన యజమాని తాళం వేశాడు. అద్దె చెల్లించాలని యజమాని పలుమార్లు ఈఎస్ఐ ఆస్పత్రికివెళ్లి అక్కడ పనిచేసే సిబ్బందిని కోరినా ఫలితం దక్కలేదు. దీంతో ఆగ్రహం చెందిన ఆయన ఆస్పత్రికి వెళ్లి ఏకంగా తాళం వేయడంతో అందులో పనిచేసే సిబ్బంది, ఆస్పత్రికి వచ్చిన రోగులు గంటపాటు ఇబ్బందులుపడ్డారు. అందులో పనిచేసే సంబంధిత అధికారులు స్థానికంగా నెలకొన్న విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించడంతో త్వరలో చెల్లిస్తామని హామీఇచ్చారు. దీంతో అతను తాళం తీశాడని వైద్య సిబ్బంది వివరించారు. నెలకు రూ.12 వేల చొప్పున రెండేళ్లకుగాను సుమారు రూ.2.40 లక్షల పై చిలుకు ఇవ్వాల్సి ఉన్నదని వైద్య సిబ్బంది వివరించారు. పదేళ్లుగా ఈఎస్ఐ ఆస్పత్రి ఇదే భవనంలో కొనసాగుతున్నది.

పిన్ని మందలించడంతో యువకుడి ఆత్మహత్య



గుట్టమీది నర్సింహులు(ఫైల్)

చిలప్‌చెడ్, మార్చి 27: జీవితంపై విరక్తి చెందిన యువకుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. చిలప్‌చెడ్ మండలం చండూరు గ్రామానికి చెందిన గుట్టమీది రాజయ్యకు కుమార్తె మాధవి, కుమారుడు నర్సింహులు(20) ఉన్నారు. రాజయ్య మొదటి భార్య పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే మృతిచెందడంతో అనితను రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా మొదటి భార్య కూతురు మాధవిని కొల్చారం మండలం పైతర గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. అయితే రాజయ్య నాలుగేళ్ల క్రితం మరణించగా.. నర్సింహులు పిన్ని వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో చెడు అలవాట్లకు బానిసై.. ఖాళీగా తిరుగుతుండడంతో పిన్ని మందలించింది. దీంతో మంగళవారం ఉదయం 7.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన నర్సింహులు సాయంత్రమైనా ఇంటికి తిరిగిరాలేదు. గ్రామానికి చెందిన బ్రాహ్మనోల్ల నర్సింహులు చెరువులోకి గేదెలను వదలగా ఒక్కసారిగా పైకి వచ్చాయి. వెంటనే వెళ్లి చూడగా గుట్టమీది నర్సింహులు మృతదేహం కనిపించడంతో గ్రామస్థులకు చెప్పాడు. వారంతా వచ్చి బయటకు తీశారు. మృతుడి సోదరి మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

చింతచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి



నరేందర్‌రెడ్డి(ఫైల్)

మనోహరాబాద్, మార్చి 27: చింతకాయలు తెంపడానికి చెట్టు పైకి ఎక్కిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి మృతిచెందాడు. మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బాన్సువాడ నరేందర్‌రెడ్డి(53) మంగళవారం పొలం వద్ద చింత చెట్టు ఎక్కి కాయలు తెంపుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి మృతిచెందాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలం వద్దకెళ్లి చూడగా చనిపోయి కనిపించాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించామని ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట, మార్చి 27: మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతిచెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని అంబాజీపేట గ్రామంలో బుధవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ నారాయణగౌడ్ వివరాల మేరకు గ్రామానికి చెందిన ద్యాప శివకుమార్(26) కొన్నిరోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఆరోగ్యం క్షీణించడంతో మనస్తాపానికి గురై ఈనెల 23న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న ద్యాప రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నటర్ల ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

కారు, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు



కారు, బైక్ ఢీకొన్న దృశ్యం

నిజాంపేట, మార్చి 27: కారు, బైక్ ఢీకొని ద్విచక్ర వాహనదారులకు గాయాలైన సంఘటన నిజాంపేట మండలంలో బుధవారం చోటు చేసుకున్నది. మండల పరిధిలోని నందగోకుల్ గ్రామానికి చెందిన మ్యాదరి కరుణాకర్, చౌద స్వామి (టీఎస్15 ఈహెచ్ 6973) నెంబరు బైక్‌పై రామాయంపేట వైపు వెళ్తున్నారు. నిజాంపేట మండల శివారులోని చల్మెడ కమాన్ వద్ద చేగుంట నుంచి సిద్దిపేటకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నారాయణ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న నిజాంపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

అత్తను హత్యచేసిన అల్లుడికి రిమాండ్



పోలీసుల అదుపులో ఏసు

టేక్మాల్, మార్చి 27: ఆస్తి కోసం అత్తను హత్యచేసిన అల్లుడిని పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ఎస్ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం .. తంపులూరు గ్రామానికి చెందిన మహిళ ఈనెల 21న హత్యకు గురైంది. మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండలం మర్వెల్లి గ్రామానికి చెందిన వరుసకు అల్లుడైన ఏసును అదుపులోకి తీసుకుని విచారించగా ఆస్తి కోసం హత్యచేశానని ఒప్పుకున్నాడు. దీంతో బుధవారం రిమాండ్‌కు తరలించారు.

బైక్‌ను తగులబెట్టిన దుండగులు



కాలిపోయిన బైక్

చిలప్‌చెడ్, మార్చి 27: ఇంటి ముందు నిలిపిన బైక్‌ను గుర్తు తెలియని దుండగులు తగులబెట్టారు. చిలప్‌చెడ్ గ్రామానికి చెందిన గాండ్ల రాములు 8 నెలల క్రితం గ్లామర్ బైక్‌ను కొనుగోలు చేశాడు. మంగళవారం రాత్రి తన ఇంటి ముందు బైక్ పార్క్ చేసి పడుకున్నాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో బైక్ తగులబడిపోతున్నదని కాళ్ల జగదీష్ రాములును లేపాడు. వెంటనే వారు మంటలను చల్లార్చారు. ఎవరో గుర్తు తెలియని దుండగులు ప్రహరీ దూకొచ్చి బైక్‌ను తగులబెట్టారని బాధితుడు రాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కనీస వేతన సవరణ చేయాలి

జిన్నారం, మార్చి 27: కనీస వేతనాలను రూ.26వేలుగా నిర్ణయించకుండా రాష్ట్ర ప్రభుత్వం చేసిన వేతన సవరణ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య అన్నారు. బుధవారం బొల్లారంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 72 రకాల షెడ్యూల్ జీవోలను సవరిస్తూ ఇచ్చిన జీవోలపై సీఐటీయూ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నదని చెప్పారు. కనీస వేతనాన్ని ఏమాత్రం పెంచకుండా సవరణ చేయడం తగదని పేర్కొన్నారు. గతంలో కనీస వేతన మండలి చేసిన ప్రతిపాదనలు కూడా ఆమోదించకుండా కార్మిక వర్గాలకు ప్రభుత్వం అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. కార్మికులకు కనీస వేతనంగా రూ.26వేలను నిర్ణయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయనవెంట సీఐటీయూ నాయకులు శ్రీధర్‌రావు, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

● మెదక్ అదనపు కలెక్టర్ రమేష్

నర్సాపూర్, మార్చి 27: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ అధికారులకు సూచించారు. బుధవారం నర్సాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ వార్డు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో తాగునీటి సమస్య రాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించి మిషన్‌భగీరథ నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలని ఆదేశించారు. మిషన్‌భగీరథ నీరు సరఫరాకు ఇబ్బంది ఉండే


నర్సాపూర్ సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కిషన్, ఎంపీడీవో మాధవిలత, డీఎల్‌పీవో యాదయ్య, మున్సిపల్ కమిషనర్ జైతురాంనాయక్, ఎంపీవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కౌడిపల్లిలో

కౌడిపల్లి: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల ప్రత్యేక అధికారులతో మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. వేసవిలో మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికి సరఫరా అయ్యేలా చూడాలని సూచించారు. అవసరమైతే ప్రైవేటు బోర్లను లీజుకు తీసుకోని తాగునీటిని అందించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిషన్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని ఓడించండి


సంగారెడ్డిలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య

సంగారెడ్డి రూరల్, మార్చి 27: దేశంలో కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రధాని మోదీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో బుధవారం నిర్వహించిన సీఐటీయూ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ కార్మిక, కర్షక, ప్రజానీకానికి చేసిందేమీ లేదని విమర్శించారు. మతాన్ని అడ్డు పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ నేతలు చూస్తున్నారన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ26 వేలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని రంగాల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడిస్తామని రాజయ్య హెచ్చరించారు. సమావేశంలో నాయకులు యాదగిరి, సువర్ణ, శోభ, రాజు, శ్రీనివాస్, మరియమ్మ, సుగుణ, సంగేశ్వర్, అంజనేయులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు. మహిళా ఉద్యోగిని లైంగికంగా వేధిస్తున్న జోగిపేట మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ ఏవో పరమేశంకు రాజయ్య ఫిర్యాదు చేశారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో బాబురావు, శ్రీను ఉన్నారు.

మట్టి టిప్పర్ల సీజ్

కొల్చారం, మార్చి 27: అసైన్డ్ భూమిలో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను కొల్చారం పోలీసులు మంగళవారం రాత్రి సీజ్ చేశారు. మండల పరిధిలోని దేవుని వెంకటాపూర్ గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా 5 టిప్పర్లలో మట్టిని నింపేందుకు వెళ్లగా గ్రామస్థులు అడ్డుకున్నారు. మట్టిని తరలించేందుకు అనుమతి ఉన్నదని రవాణాదారులు గ్రామస్థులతో వాగ్వాదానికి దిగారు. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు వెళ్లి టిప్పర్లను సీజ్ చేశారు. కాగా మట్టిని తవ్వే ఎక్స్‌కవేటర్‌ను వదిలిపోవడం గమనార్హం. బుధవారం ఉదయం నాలుగు టిప్పర్లను వదిలిపెట్టి, మట్టితో ఉన్న ఒక్క టిప్పర్‌ను మాత్రమే సీజ్ చేసి జరిమానా నిమిత్తం తహసీల్దార్‌కు నివేదించారు. నాలుగు టిప్పర్లను వదిలి పెట్టడంపై దేవుని వెంకటాపూర్ గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని, ఇసుకను తరలించినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మహ్మద్‌గౌస్ తెలిపారు.

సెల్‌ఫోన్‌లు అప్పగింత

చిన్నశంకరంపేట, మార్చి 27: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి బాధితులకు అప్పగిస్తామని ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. చిన్నశంకరంపేట మండలంలోని సూరారం గ్రామానికి చెందిన తలారి రమేష్, మహేష్ గత నెలలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకొని సీఈఆర్ఐ యాప్ అప్లై చేసుకొని పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సెల్‌ఫోన్‌లను సాంకేతిక పరిజ్ఞానంతో కనిపెట్టి స్వాధీనం చేసుకుని, బుధవారం అప్పగించారు. ఎవరైనా సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుంటే మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్‌లను పట్టుకున్న కానిస్టేబుల్ రాజశేఖర్‌ను ఎస్ఐ అభినందించారు.

పగడయ్యకు జిల్లా ఉత్తమ ఫార్మసిస్టు అవార్డు

చేగుంట, మార్చి 27: చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్టుగా విధులు నిర్వహిస్తున్న పగడయ్యకు జిల్లా ఉత్తమ ఫార్మసిస్ట్‌గా జిల్లా వైద్యాధికారి శ్రీరాములు బుధవారం అవార్డును ప్రదానం చేశారు. తన సర్వీస్‌లో ప్రజలకు చేసిన సేవలను గుర్తించి, ప్రజల నుంచి మన్ననలు పొందారు. త్వరలో పదవీ విరమణ పొందుతున్న పగడయ్యను జిల్లా వైద్యాధికారి శ్రీరాములు సన్మానించి, అభినందించారు.

హిందువులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

జిన్నారం, మార్చి 27: మేడ్చల్ జిల్లా చెంగిచర్లలో హోలీ వేడుకలు జరుపుకుంటున్న హిందువులపై దాడి చేసిన ఓ వర్గంపై చర్యలు తీసుకోవాలని హిందు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్, ఎస్ఐలకు ఫిర్యాదు చేశారు. హిందు పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఆనంద్‌చారి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, నర్సింలు, వినోద్, బార్గవ్, శ్రీనివాస్‌యాదవ్, అశోక్, సంతోష్‌గౌడ్, రవి తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

నగదు ప్రోత్సాహకం అందజేత

రామచంద్రాపురం, మార్చి 27: చదువులో ఉత్తమ ప్రతిభను కనబర్చిన వారిని ప్రోత్సహించాలని కార్పొరేటర్ వి.సింధూఆదర్శరెడ్డి అన్నారు. గీతభూపాల్‌రెడ్డి కళాశాల నుంచి 981/1000 మార్కులు సాధించిన పి.శ్రావ్యలతకు కార్పొరేటర్ రూ.50 వేల నగదు ప్రోత్సహకాన్ని నీట్ కోచింగ్ కోసం బుధవారం అందజేశారు. కష్టపడి చదువుకునే విద్యార్థులకు తమ వంతు సహకారం ఉంటుందని కార్పొరేటర్ అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్, విజయలక్ష్మి, పరమేష్‌యాదవ్, ఆరీఫ్ పాల్గొన్నారు.

కర్ణాటక మంత్రికి ఘన స్వాగతం

జహీరాబాద్, మార్చి 27: కర్ణాటక వైద్యశాఖ మంత్రి శరణుప్రకాష్ పాటిల్ బుధవారం హైదరాబాద్ నుంచి జహీరాబాద్ మీదుగా గుల్బర్గకు వెళ్తుండగా.. తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి జహీరాబాద్ పట్టణంలో ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఉజ్వల్‌రెడ్డి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

జిన్నారం, మార్చి 27: బొల్లారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, క్యాన్సర్ వ్యాధిపై బుధవారం స్వప్నిక రేహా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. పాఠశాలకు రోటరీ క్లబ్ హిమాయత్ నగర్ శాఖ తరఫున ప్రింటర్‌ను అందజేశారు.

కౌన్సిలర్ ఇంటి ముందు ఆందోళన

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 27: ఎమ్మెల్యే రోహిత్‌పై మెదక్ 5వ వార్డు కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు బుధవారం రాత్రి ఆయన ఇంటి ముందు ఆందోళనకు దిగారు. మంగళవారం వైస్రాయ్ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కౌన్సిలర్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం ఉదయం పది గంటల్లోగా క్షమాపణ చెప్పకుంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పోలీసుల విజ్ఞప్తి మేరకు ఆందోళనను విరమించారు. ఆందోళనలో కాంగ్రెస్ నాయకులు జీవన్‌రావు, బొజ్జపవన్, తాహెర్, పరుశురాంగౌడ్, అహ్మద్, మన్సూర్‌అలీ, మైసన్, సంగమేశ్వర్, రిజ్వాన్, భాను పాల్గొన్నారు.

'క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలి'

మెదక్ అర్బన్, మార్చి 27: క్షయ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతంగా ఉండాలని డీఎంహెచ్‌వో శ్రీరామ్ సూచించారు. బుధవారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన టీబీ డేలో ఆయన మాట్లాడుతూ.. క్షయ మైక్రో బ్యాక్టీరియం ట్యూబర్ క్యూలోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా కలిగే అంటువ్యాధి అన్నారు. చికిత్స ద్వారా వ్యాధిని పూర్తిగా నివారించవచ్చన్నారు. వారం రోజులు పైబడి దగ్గుతో బాధ పడుతున్న వారు క్షయవ్యాధి పరీక్ష చేయించుకోవాలన్నారు. దేశం గెలుస్తుంది.. టీబీ అంతం మనందరి పంతం అనే నినాదంతో ముందుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు విజయనిర్మల, అరుణశ్రీ, అనిలా, పరిపాలన అధికారి నవీన్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాలతో కవాతు


వెల్దుర్తిలో కవాతు చేస్తున్న పోలీసులు

వెల్దుర్తి, మార్చి 27: లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు ఓటు హక్కును ప్రశాంతమైన వాతావరణంలో వినియోగించుకోవాలని తూప్రాన్ సీఐ కృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తి పోలీస్ స్టేషన్ నుంచి ప్రధాన వీధుల గుండా కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... ఓటర్లు ప్రజాస్వామ్య బద్ధంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీసులు రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నవతగౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టుద్వారా ఓటరు కార్డుల పంపిణీ

జహీరాబాద్, మార్చి 27: నూతన ఓటరు గుర్తింపు కార్డులను పోస్టాఫీసుల ద్వారా నేరుగా ఇంటికే పంపిస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ సతీష్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 10,500 ఓటరు గుర్తింపుకార్డులను ఆయా గ్రామాలకు పోస్టు ద్వారా పంపించినట్లు వెల్లడించారు. త్వరలో మరో రెండువేల కార్డులను పోస్టాఫీసుల ద్వారా పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వివరించారు. ఓటరు గుర్తింపుకార్డులు అందనివారు ఆయా తహసీల్దార్ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.

జహీరాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా

మునిపల్లి, మార్చి 27: ఎంపీ ఎన్నికల్లో జహీరాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగుర వేస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పెద్దగోపులారం ఎంపీటీసీ పాండు అన్నారు. బుధవారం మండల పరిధిలోని బుదేరా చౌరస్తాలో విలేకరులతో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాల మాదిరిగానే ఎంపీ ఎన్నికల్లో కూడా ప్రజలంతా కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం తాము పని చేస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు అర్హులైన వారందరికి అందిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మాటలను ప్రజలెవరూ నమ్మే స్థితిలో లేరని ఆయన చెప్పారు.

నీటి సమస్యను తీర్చకుంటే ఎన్నికలను బహిష్కరిస్తాం

● బొల్లారం బీసీకాలనీవాసుల హెచ్చరిక
● మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

జిన్నారం, మార్చి 27: నీటి సమస్యను పరిష్కరించి, కనీస వసతులు కల్పించకుంటే పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తామని బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ గోపాలమ్మ, బీసీ కాలనీవాసులు హెచ్చరించారు. బీసీ కాలనీలో నీటి సమస్యను తీర్చాలని బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో గంట పాటు ధర్నా చేశారు. బీసీ కాలనీలో నెల రోజులుగా తీవ్ర నీటి సమస్య నెలకొన్నదని, ఈ విషయాన్ని కమిషనర్, ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని కౌన్సిలర్ గోపాలమ్మ అన్నారు. కాలనీలో 600 నివాసాలు, 4వేల జనాభా ఉండగా నెల రోజుల్లో కేవలం మూడు ట్యాంకర్ల నీటిని అందించారని చెప్పారు. కాలనీలో రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ సరఫరా వంటి కనీస వసతులు సక్రమంగా లేవని తెలిపారు. కాలనీ సమస్యలను పరిష్కరించకుంటే పార్లమెంట్ ఎన్నికలను బహిష్కారిస్తామని కౌన్సిలర్ గోపాలమ్మ, కాలనీవాసులు హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ నిర్మలారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు.



బొల్లారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బీసీ కాలనీవాసుల ధర్నా

మహిళలను రైతులుగా గుర్తించాలి

● మహిళా రైతుల హక్కుల వేదిక నాయకుల డిమాండ్

సంగారెడ్డి టౌన్, మార్చి 27: వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో మహిళలపై వ్యవస్థీకృత హింసను తగ్గించాలని మహిళా రైతుల హక్కుల వేదిక జాతీయ నాయకురాలు రుక్మిణీరావు, జిల్లా వ్యవసాయ అధికారిణి పుష్పరాణి అన్నారు. సంగారెడ్డిలోని జిల్లా సమాఖ్య భవనంలో బుధవారం మహిళా రైతుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో వ్యవసాయం సంక్షోభం నేపథ్యంలో మహిళా రైతులపై వ్యవస్థీకృత హింస అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలను రైతులుగా గుర్తించాల్సిన ఆవశ్యకత ఎంతగానో ఉన్నదన్నారు. వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న మహిళలు కుటుంబంలో, పని స్థలాల్లో ఎదుర్కొంటున్న వేధింపులను నివారించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాల్లో వివక్షను చూపకుండా విధానపరమైన మార్పులు తీసుకురావాలన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతు ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నందున అధ్యయనం కోసం మెదక్ జిల్లాను ఎంచుకున్నట్లు వెల్లడించారు. సదస్సులో రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర నాయకులు కొండల్‌రెడ్డి, మహిళా జాతీయ నాయకులు ఆశాలత, ఉషా సీతాలక్ష్మి, సఖీ సెంటర్ డైరెక్టర్ శివకుమారి, తెలంగాణ జన సమితి మహిళా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, ప్రతినిధులు అందె ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి పుష్పరాణి

కాలువల నిర్మాణంలో నాణ్యత లోపించవద్దు

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, మార్చి 27: నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని భూములకు సక్రమంగా సాగునీటి సరఫరా కోసం చేపట్టిన కాలువల నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకూడదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి నీటిపారుదల శాఖ అధికారులకు, కాంట్రాక్టరుకు సూచించారు. మండల పరిధిలోని బీబీపేట్ గ్రామ శివారులో నల్లవాగు ప్రాజెక్టు కుడి కాలువ వద్ద నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. బీఆర్ఎస్ హయాంలో బిల్లులు లేక నిలిచిపోయిన పనులను తాను ఎమ్మెల్యే అయ్యాక కాంట్రాక్టరుతో మాట్లాడి ప్రారంభింపజేసినట్లు తెలిపారు. పనులు నాణ్యతగా జరిగేలా అధికారులు తనిఖీలు చేపట్టాలని సూచించారు. పొలాలకు నీటిని అందించే కాలువలకు లీకేజీలు ఉంటే మరమ్మతులు చేపట్టాలని అదనంగా చేపట్టిన పనులకు బిల్లులు నీటిపారుదల శాఖ ఈఎన్‌సితో మాట్లాడి మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కాగా నీరందక జొన్న, వరి పంటలు ఎండుతున్నాయని, రెండు దఫాలుగా నల్లవాగు ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయించాలని ఫత్తేపూర్, బీబీపేట్ రైతులు ఎమ్మెల్యేను కోరారు. నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి రెండు, మూడు రోజుల్లో సాగునీరు విడులయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు ఎన్నం జితేందర్‌రెడ్డి, జయరాజ్, సంతోష్‌రెడ్డి, జారా సంగారెడ్డి, లక్ష్మయ్య, పొల్కం సాయిలు, ఉప్పరి విఠల్ తదితరులు ఉన్నారు.


బీబీపేట్ శివారులో నల్లవాగు ప్రాజెక్టు కుడి కాలువ వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో మహిళా దినోత్సవం

● హాజరైన రాష్ట్రపతి అవార్డు గ్రహీత సాజిదాఖాన్

పుల్‌కల్, మార్చి 27: చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ప్రపంచ మహిళా దినోత్సవం నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ప్రథమ మహిళా సంగీత సాంకేతిక నిపుణురాలు సాజిదాఖాన్ హాజరై, మాట్లాడారు. మహిళలు అంకిత భావంతో పనిచేస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని చెప్పారు. ఇది మహిళా లోకానికి ఎంతో గర్వకారణమన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సునీతారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జి.నర్సింహ, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, విభాగాధిపతులు ప్రసన్నలక్ష్మీ, సునీత పాల్గొన్నారు. కాగా జేఎన్టీయూలో కళాశాల పరిపాలన భవనం ప్రవేశ ద్వారం వద్ద సరస్వతీ విగ్రహన్ని ఏర్పాటు చేశారు.


జ్యోతిని వెలిగిస్తున్న సాజిదాఖాన్

తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వకుంటే కఠిన చర్యలు

● దాబాలు, హోటళ్ల యజమానులకు ఎంపీవో హెచ్చరిక


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీవో మహేందర్‌రెడ్డి

కంది, మార్చి 27: తడి, పొడి చెత్తను వేరుచేసి పంచాయతీ వాహనాలకు ఇవ్వకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని కంది మండలంలోని దాబాలు, హోటళ్ల యజమానులను ఎంపీవో మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన కంది ఎంపీడీవో కార్యాలయంలో దాబాలు, హోటళ్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. వ్యర్థపదార్థాలు, మిగిలిపోయిన ఆహారం, కూరగాయాలు ఇతర చెత్తను దాబాలు, హోటళ్ల వద్దనే తడి, పొడి చెత్తగా వేరు చేయాలని సూచించారు. వేరు చేసిన చెత్తను మాత్రమే పంచాయతీకి అందించాలన్నారు. ఇష్టారాజ్యంగా చెత్తను ఆరుబయట పారబోస్తే జరిమానాలు విధించి, హోటళ్లను సీజ్ చేస్తామని ఎంపీవో హెచ్చరించారు. సమావేశంలో కార్యదర్శి విద్యాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎండిన పంటలకు పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి

● దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి డిమాండ్

చేగుంట, మార్చి 27: ఎండిన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నార్సింగ్ మండలం నర్సంపల్లి పెద్దతండాలో ఎండిన వరి పొలాలను బుధవారం ఆయన పరిశీలించారు. పంటలు ఎండిపోవడంతో రైతులు పూర్తిగా నష్టపోయారని, రైతులకు ఎకరాకు రూ.20వేల చొప్పున పరిహారం కింద చెల్లించాలని డిమాండ్ చేశారు. పంట పొలాలకు నీరందించేందుకు ప్రాజెక్టుల గేట్లు ఎత్తకుండా ప్రతిపక్ష నాయకులను చేర్చుకోవడానికి కాంగ్రెస్ పార్టీ గేట్లు ఎత్తుతున్నదని ఎద్దేవా చేశారు. రైతుభరోసా, రుణమాఫీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు కూడా సక్రమంగా రావడం లేదన్నారు. ఇప్పటికైనా మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ నుంచి పంట పొలాలకు నీటిని విడుదల చేసి దుబ్బాక నియోజకవర్గంలోని గ్రామాల్లో చెరువు కుంటలు నింపాలని ఎమ్మెల్యే కోరారు. ఆయనవెంట జడ్పీటీసీలు కృష్ణరెడ్డి, మోదం శ్రీనివాస్, మాజీ సర్పంచులు మంచి కట్ల శ్రీనివాస్, చత్రియనాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆకుల మల్లేష్‌గౌడ్, తండారైతులు ఉన్నారు.


నర్సంపల్లి పెద్దతండాలో ఎండిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

రాయికోడ్, మార్చి 27: కర్చల్‌లో నూతనంగా నిర్మించిన రేణుకాల ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన నాయకులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ విభాగ అధ్యక్షుడు జి.అంజయ్య, డీసీసీ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ మొగులప్ప, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాలాజీ నర్సింహులు, తాజా మాజీ సర్పంచు శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌చారి, నాయకులు బాబుకుమార్, బాబాగౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, అనంతంగౌడ్, సంగమేశ్వర్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, విష్ణుగౌడ్, ఫణికుమార్, మశ్చేందర్, కేదార్‌నాథ్ పాటిల్, చరణ్ పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన

రామాయంపేట: కోమటిపల్లి గిరిజన తండాలోని హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన బుధవారం నిర్వహించారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఆమెవెంట మున్సిపల్ ఛైర్మన్ జితేందర్‌గౌడ్, కౌన్సిలర్ నాగరాజు వేడుకలకు హాజరయ్యారు.

సమస్యలు తలెత్తకుండా చర్యలు

చిన్నశంకరంపేట, మార్చి 27: గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా గ్రామ పంచాయతీ కార్యదర్శులు అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో దామోదర్ సూచించారు. బుధవారం ఎంపీపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంపీడీవో దామోదర్ మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో స్వచ్ఛత పాటించాలన్నారు. తాగునీటి సమస్యలేకుండా చూడాలని సూచించారు. వివిధ అభివృద్ధి పనులపై కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ఎంపీవో కలిముల్ల పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పేరుతో బీజేపీ ఎన్నికల నాటకం

మాసాయిపేట, మార్చి 27: ఎస్సీ వర్గీకరణ పేరుతో ఎన్నికల ముందు కేంద్రంలోని బీజేపీ నాటకమాడుతున్నదని, బీజేపీ నాయకులు మరోమారు మాదిగలను మోసం చేయాలని చూస్తున్నారని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బుడ్డి కృష్ణ, జిల్లా నాయకుడు హరిప్రసాద్ విమర్శించారు. మండల కేంద్రమైన మాసాయిపేటలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో హామీ ఇచ్చినట్లుగా 100 రోజుల్లో వర్గీకరణ అంటూ మాదిగ జాతిని మోసం చేసి మరోసారి ఎన్నికల ముందు వర్గీకరణ పేరుతో ఓట్లను దండుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. బీజేపీ కుయుక్తులను గ్రహించి మాదిగలు చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. వర్గీకరణ సాధనకు టీఎస్ ఎమ్మార్పీఎస్ అంతులేని పోరాటం భవిష్యత్తులో నిర్వహిస్తుందని పేర్కొన్నారు.

జహీరాబాద్‌లో బీజేపీదే విజయం


రేగోడు బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

రేగోడు, మార్చి 27: ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీ స్థానం బీజేపీదేనని అందోల్ కన్వీనర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం రేగోడు మండల బూత్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి బలమైన ఓటు బ్యాంకు ఉన్నదన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో జహీరాబాద్ ఎంపీ బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ రేగోడు మండలంలో భారీ సమావేశం నిర్వహిస్తున్నారని, వారి ఆధ్వర్యంలో భారీగా చేరికలు ఉంటాయని తెలిపారు. ప్రతి కార్యకర్త బీజేపీ గెలుపు కోసం పోరాడాలని సూచించారు. సమావేశంలో బీజేపీ మండల నాయకులు సంగమేశ్వర్, విఠల్‌రావు, భాస్కర్‌రెడ్డి, దత్తు, ఆంజనేయులు, సతీష్‌గౌడ్, పండరిరెడ్డి, శ్రీనాథ్‌చారి, అనిల్, శ్రీకాంత్, శివకుమార్, శ్రీరాం నాయక్, రామాగౌడ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిక


బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు

మునిపల్లి , మార్చి 27: మండల పరిధిలోని చీలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బూరగోని శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో ఎంపీ బీబీపాటిల్ సమక్షంలో 100మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. బీబీపాటిల్ మాట్లాడుతూ.. తన గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీని గెలిపించాలని కోరారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక


ఆవుల రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

వెల్దుర్తి, మార్చి 27: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు కలుగుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో వెల్దుర్తి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆవుల మల్లేష్‌చారి, మహేందర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు బీఆర్ఎస్ పార్టీని వీడి రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, నాయకులు నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులు

● మెదక్ డీఈవో రాధాకిషన్

రేగోడు, మార్చి 27: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నడుస్తున్నాయని మెదక్ డీఈవో రాధా కిషన్ అన్నారు. మంగళవారం రాత్రి జరిగిన రేగోడు ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో డీఈవో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రభుత్వ బడుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, నాణ్యమైన విద్యను అందించేందుకు శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్‌మూర్తి, అల్లాదుర్గం మండల పీఆర్టీయూ అధ్యక్షుడు జనార్దన్, విశ్రాంత ఎంఈవో అశోక్‌కుమార్, సంగమేశ్వర్, పాఠశాల హెచ్ఎం అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి

● సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణగుప్తా

తూప్రాన్, మార్చి 27: మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే 36వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు సత్తాచాటి, విజయం సాధించాలని తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొడిప్యాక నారాయణగుప్తా పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర బాలల జట్టుకు మెదక్ జిల్లా నుంచి ఎంపికైన నందులాల్, ఎస్ రెడ్డి, సాయికుమార్, బాలికల జట్టుకు ఎంపికైన నందినిలను బుధవారం ఆయన తూప్రాన్‌లో సన్మానించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ మేరకు తల్లితండ్రులకు కూడా పిల్లలకు సహకరించాలని కోరారు. సాఫ్ట్‌బాల్ తెలంగాణ జట్టుకు ఎంపికైనందుకు జిల్లా క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్‌గుప్తా, నాయకులు మామిండ్ల కృష్ణ, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్‌శర్మ పాల్గొన్నారు.